
లక్షెట్టిపేట : క్రీడలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్
- జిల్లాస్థాయి గిరిజన ఆశ్రమ క్రీడలు ప్రారంభం

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 30 : ప్రతీ విద్యార్థి పట్టుదల క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ సూచించారు. పట్టణంలోని మహాత్మా జ్యోతీ బా పూలే పాఠశాల మైదానంలో శనివారం జిల్లాస్థాయి గిరిజన ఆశ్రమ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలు దేహ దారుఢ్యానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి క్రీడాకారులను జోనల్‌స్థాయికి పంపిస్తామని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని గెలుపుకంటె రెట్టింపుగా స్వీకరించాలని సూచించారు. అనంతరం డీటీడీవో నీలిమతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రీడాకారులను పరిచయం చేసుకని, జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. సుమారు 16 గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో రాజమౌళి, ఏటీడీవో చిరంజీవి, జిల్లా గిరిజన ఆశ్రమ క్రీడల అధికారి జీవరత్నం, కన్వీనర్ గఫార్, స్పెషల్ ఆఫీసర్ మాడావి శంకర్, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంజేపీ ప్రిన్సిపాల్ గౌతం రెడ్డి పాల్గొన్నారు.

## వెల్గనూర్‌లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన..

దండేపల్లి, సెప్టెంబర్ 30 : దండేపల్లి మండలం వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని డీఈవో ఎస్ యాదయ్యతో కలిసి అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాలోనే మొట్టమొదటి సారిగా వెల్గనూర్ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రతి నెలా నాల్గో శనివారం జిల్లాలోని ప్రతీ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై మండల స్థాయి అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంపీడీవో మల్లేశ్, ఎస్ఐ ప్రసాద్, ఏవో అంజిత్‌కుమార్, వైద్యాధికారి సతీశ్‌కుమార్, సర్పంచ్, ఉపసర్పంచ్ శంకరయ్య, కాంద్రపు లక్ష్మణ్, హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెరుగైన రవాణా కోసమే రహదారుల విస్తరణ

- అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్ఎస్‌కు పట్టంకట్టాలి
- ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- మంచిర్యాలలో రూ. 35 కోట్లతో ఆరు వరుసల రహదారి పనులకు శంకుస్థాపన


బైపాస్‌రోడ్డుకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 30 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మెగైన రవాణాకోసం రహదారుల విస్తరణ చేపడుతున్నట్లు పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంచిర్యాల పట్టణంలోని శ్రీనివాస గార్డెన్ నుంచి ఐబీ చౌరస్తా వరకు రూ.35 కోట్లతో నిర్మించే 6 వరుసల రహదారి పనులకు శనివారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడారు. మంచిర్యాల నుంచి మందమర్రి వెళ్లే రహదారిని ఆరు వరుసలుగా మార్చేందుకు ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసిందని, పెరిగిన జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన మేరకు రహదారి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి దొరగారి పల్లి మీదుగా కుర్మపల్లి వరకు రాజీవ్ రహదారిని విస్తరించినట్లు చెప్పారు. దీంతో మంచిర్యాల పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా అటు నుంచే వెళ్తున్నాయన్నారు. మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల నుంచి జిల్లా కేంద్రానికి సులభంగా చేరుకునేందుకు కొత్తగా నిర్మించే ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇంతపెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధిని, పెద్ద ఎత్తున అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. ఎన్నికల సమయంలో వచ్చే మాయగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ వసుందర, కౌన్సిలర్లు నల్ల శంకర్, హరికృష్ణ, సురేశ్ బల్దవా, పోరెడ్డి రాజు, బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, పల్లపు తిరుపతి, రవీందర్‌రావు, బుద్దార్థి రాంచందర్, శ్రీనివాస్, సుబ్బయ్య, నగేశ్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బైపాస్ రోడ్డు , సెంట్రల్ లైటింగ్ సిస్టం ప్రారంభం

మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీటాకీస్ చౌరస్తా నుంచి లక్షెట్టిపేట రోడ్‌లోని వైశ్య భవన్ చౌరస్తా వరకు రూ.15 కోట్లతో నిర్మించిన బైపాస్‌రోడ్డు, సెట్రల్ లైటింగ్ సిస్టంను ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ.. మంచిర్యాల పట్టణానికే ఈ బైపాస్‌రోడ్డు తలమానికంగా నిలుస్తుందని, వెడల్పాటిగా రెండు వరుసల్లో ఈ రోడ్డును అత్యంత బలమైనదిగా నిర్మించడం జరిగిందని, ఇదే రోడ్డు పొడవునా సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాబోవురోజుల్లో భారీ వాహనాలు, ఇతర వాహనాలు సులభంగా లక్షెట్టిపేట వైపు, ఇటు నుంచి మందమర్రి వైపు వెళ్లేందుకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పట్టణవాసులకు సైతం బైపాస్‌రోడ్డు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వానికి, అందుకోసం కృషిచేసిన తమకు ప్రజలు ఎల్లవేళలా మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రం తిరుపతి, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిపల్లెలకు మంచి రోజులు

- సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- బెజ్జూర్ మండలంలో పర్యటన
- బెజ్జూర్-సోమిని రోడ్డుకు జాతీయ వన్యప్రాణుల సంరక్షణ బోర్డు అనుమతి


అటవీ అనుమతుల మంజూరు కాపీలను నాయకులు, ప్రజా ప్రతినిధులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్, సెప్టెంబర్ 30 : మారుమూల గిరిపల్లెలకు మంచి రోజులు రాబోతున్నాయని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సోమిని, మొగవెళ్లి, ఇప్పలగూడ, కుశ్నపల్లి తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 2017-18లో బెజ్జూర్-సోమిని రోడ్డు మంజూరైందన్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వం అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు చేపట్టడం ఆలస్యమైందని పేర్కొన్నారు. కానీ, అటవీ అనుమతుల కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగడంతో జాతీయ వన్యప్రాణల సంరక్షణ బోర్టు నుంచి స్టేజ్-1 అనుమతులు మంజూరైనట్లు చెప్పారు. సంబంధిత కాపీలను సోమిని, మొగవెళ్లి సర్పంచులు, జడ్పీటీసీ, నాయకులకు అందజేశారు. త్వరలో పూర్తిస్థాయి అనుమతులు రానుండడంతో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. రోడ్డు, వంతెనల నిర్మాణాలు పూర్తయితే మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. అలాగే ఈ నెల 3న మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. ఆయన వెంట జడ్పీటీసీ పంద్రం పుష్పలత, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ కోండ్ర జగ్గాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సిడాం సకారాం, సింగిల్ విండో మాజీ చైర్మన్ డోకె వెంకన్న, సర్పంచులు తొర్రెం శంకర్, ఎలాది శారద, ఆలం మంగళ, వడ్డెపల్లి లావణ్య, ఎంపీటీసీ లంగారి శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, నాయకులు కోట్రంగి రామకృష్ణ, నరేందర్ గౌడ్, జావీద్ అలీఖాన్, దందెర ఇస్తారి, ఆలం అనిల్, ఏలాది శేఖర్, వడ్డెపల్లి శ్రీనివాస్, సడ్మెక పురుషోత్తం, రహ్మాత్ పాల్గొన్నారు.


మంత్రి ఐకే రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ నగేశ్, నాయకులు

# మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 30 : పెర్సపేన్ ఆలయాలు, పాట్నాపూర్ శ్రీ పులాజీబాబా ధ్యాన మందిరానికి నిధులు కేటాయించడంపై రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ నగేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని 60 పెర్సపేన్ ఆలయాలకు రూ.6 కోట్లు, పులాజీ బాబా ధ్యాన మందిరం, కొత్తపల్లి దీక్షా భూమికి రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇంతియాజ్‌లాలా, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.


ఒప్పంద ప్రాతిపదికన నియామకమైన వైద్యురాలికి ఉత్తర్వులను అందజేస్తున్న కలెక్టర్

# మెరుగైన వైద్యం అందించాలి

- సమయపాలన పాటించాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు
- ఒప్పంద ప్రాతిపదికన నలుగురు వైద్యులకు నియామక పత్రాల అందజేత

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 30 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. ఆయా దవాఖానల్లో ఒప్పంద ప్రాతిపదికన ఎంపికైన నలుగురు వైద్యాధికారులకు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజలకు మరింత వేగంగా వైద్య సేవలు అందించేందుకు ఒప్పంద ప్రాతిపదికన వైద్యాధికారులను నియమించడం జరిగిందన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యాధికారులను నియమించినట్లు చెప్పారు. పెంచికల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ అశ్రిన్, తిర్యాణి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ లక్ష్మీప్రసన్న, వాంకిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ రుద్రాణి, జైనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ ఎండీ నిసారుద్దీన్‌ను నియమించడం జరిగిందని వివరించారు. వైద్యాధికారులు విధుల్లో సమయపాలన పాటిస్తూ వైద్య సేవల కోసం వచ్చే ప్రజలతో స్నేహభావంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం పాల్గొన్నారు.